క్లుప్తంగా

తప్పిన ప్రమాదం

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని టీజీ మినరల్ వాటర్ ప్లాంట్‌పై చెట్టు కొమ్మ విరిగి పడింది. బుధవారం కురిసిన వర్షం, గాలులకు ఒక్కసారిగా కొమ్మ విరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మునిసిపల్ అధికారులు వెంటనే ఆ కొమ్మను తొలగించారు.

స్కేటింగ్‌లో ప్రతిభ చాటాలి



రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు

కర్నూలు (టౌన్): కాకినాడలో ఈనెల 18న నిర్వహించనున్న 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య సూచించారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న రోలర్ స్కే టింగ్‌లో ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలను అవకాశంగా మలచుకొని అత్యుత్తమ ప్రదర్శనతో పతకాలతో తిరిగి రావాలన్నారు. జిల్లా స్కేటింగ్ సంయుక్త కార్యదర్శి సునీల్ రాష్ట్రపోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ప్రకటించారు. అండర్-11 విభాగంలో సోయల నింజిష, మాన్విశ్రీ, హ్రితిక రెడ్డి, బాలుర విభాగంలో శ్రీతిక్ చౌదరి, ప్రిన్స్ లియో, హితాక్ష్ అండర్-14 విభాగంలో సాహితీ, దీక్షిత్ రెడ్డి, జయంత్ రెడ్డి, మహమ్మద్ రయాన్, శామ్యూల్ రెనాల్డ్ ఎంపికైన వారిలో ఉన్నారు.

డీఆర్వోకు హెచ్‌ఆర్‌సీ కార్యదర్శి బాధ్యతలు

కర్నూలు(సెంట్రల్): హ్యూమన్ రైట్స్ కమిషన్ కార్యదర్శి, కార్యనిర్వహణాధికారిగా డీఆర్వో చిరంజీవి పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కమిషన్ కార్యాలయంలో ఇన్‌చార్జిగా కార్యదర్శిగా ఉన్న పి.హనుమంతరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డీఆర్వోకు హెచ్‌ఆర్‌సీ కార్యదర్శి బాధ్యతలను అప్పగించిన విషయం విదితమే. విభాగాధికారులు పి.హనుమంతరెడ్డి, జి.సునీత, బొగ్గరం తారక నరసింహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

కర్నూలు కల్చరల్: మేధావులను అక్రమంగా నిర్బంధించి, స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తూ కుట్ర పన్నుతున్న రాజ్యానికి వ్యతిరేకంగా మేధావులు, కవులు, కళాకారులు ఏకమై పోరాడాలని వక్తలు అన్నారు. ఇటీవల మరణించిన ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభ నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం జరిగింది. కర్నూలు కవులు నిర్వహించిన సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షత వహించారు. సభ ప్రారంభానికి ముందు ఆయన చిత్రపటానికి జోహార్లు అర్పించారు. ప్రజాభ్యుదయ సంస్థ నాయకులు భార్గవ మాట్లాడుతూ.. సాయిబాబా పేదలు, ఆదివాసీలు, స్థూలంగా మానవ హక్కుల కోసం పోరాడి అలసి సొలసి మనపై బాధ్యత ఉంచి వెళ్లారన్నారు. ఆయన ఆశయాన్ని కొనసాగించాల్సిన అవసరం ప్రగతిశీల వాదులపై ఉందన్నారు. విరసం నాయకులు పాణి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, విరసం నాయకులు నాగేశ్వరాచారి మాట్లాడుతూ రాజ్యం చేసిన కుట్రకు బలైన మేధావి సాయిబాబా అన్నారు. అంతకుముందు నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా అభ్యుదయ గేయాలను పాడారు. సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, కవులు, రచయితలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త మృతి



రామచంద్రన్

కర్నూలు కల్చరల్: ఆర్‌ఎస్‌ఎస్ జ్యేష్ఠ కార్యకర్త, శివాజీ మెమోరియల్ కమిటీ పూర్వ సంఘటనా కార్యదర్శి, సరస్వతీ విద్యాపీఠం పూర్వపు జిల్లా కార్యదర్శి గుజరాతి రామచంద్రన్ మంగళవారం రాత్రి మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక తుది శ్వాస విడిచారు. ఈయన మృతికి పలువురు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సంతాపం ప్రకటించారు. రామచంద్రన్ భారత్ వికాస్ పరిషత్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు (టౌన్): తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని ఒత్తిళ్లు రావడంతో వ్యక్తి బలవన్మరణం చెందాడు. వివరాలు.. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పందిపాడు గ్రామంలో యూసుఫ్ పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య జిలేకా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ అవసరాల కోసం రూ.4 లక్షలు అప్పు చేశాడు. సరైన సమయంలో తిరిగి చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈ స్థితిలో బుధవారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమీప బంధువును చూసేందుకు భార్య పిల్లలతో కలిసి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యూసుఫ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పంచ్ కొడితే నాకౌటే!

- నగరంలో మార్షల్‌ఆర్ట్స్‌కు పెరుగుతున్న ఆదరణ
- కరాటే, తైక్వాండో, ఉషూ క్రీడల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ
- కఠోర శిక్షణతో రాణిస్తున్న బాలబాలికలు
- జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాల పంట



మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకుంటున్న బాల బాలికలు





కర్నూలు (టౌన్): బాలబాలికలు అంటే సున్నితంగా ఉంటారు. చదువుకోవాలి. ర్యాంకులు తెచ్చుకుంటే చాలు. అన్న తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు కనిపిస్తోంది. చదువుతో పాటు అదనంగా ఏదైనా కరిక్యూలమ్ ఉంటేనే ఉపాధి, ఉద్యోగాల్లో అవకాశాలు వచ్చే రోజులివి. అలాగే ప్రస్తుత సమాజంలో బాలబాలికలు అన్న తేడా లేకుండా తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను తైక్వాండో, కరాటే, ఉషూ వంటి కఠినమైన సాధన, కఠోర శిక్షణ ఉన్న మార్షల్ ఆర్ట్స్ వైపు ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రీడల వల్ల వారిలో ఆత్మవిశ్వాసం, ధైర్యం, విపత్కర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అలాగే ఈ క్రీడలను ఒలింపిక్ సంఘం గుర్తించింది. గుర్తింపు ఉన్న క్రీడల్లో సాధన చేసి ఉత్తమ ఫలితాలు వస్తే వ్యక్తిగతంగా క్రీడాకారులకు ఎన్నో అవకాశాలు లభిస్తాయి. ప్రొఫెషనల్ చదువుల్లోనూ, ఇంజినీరింగ్, మెడిసిన్ ఇలా సీట్ల కేటాయింపులో ప్రత్యేకించి 2 శాతం రిజర్వేషన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. దీంతో ఇప్పుడు కర్నూలు నగరంలో మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలకు ఆదరణ పెరుగుతోంది. నగరంలోని ఔట్‌డోర్, ఇండోర్ స్టేడియం, పెద్దమార్కెట్ మున్సిపల్ పార్కు, పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న మున్సిపల్ పార్కు, జొహరాపురం పార్కు, కిడ్స్ వరల్డ్, యునైటెడ్ క్లబ్, వీకర్ సెక్షన్ కాలనీలలో ప్రతి రోజూ పదుల సంఖ్యలో బాలబాలికలు మార్షల్ ఆర్ట్స్ శిబిరాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. కొంత మంది మాస్టర్లు ఉచితంగా శిక్షణ ఇస్తుండగా మరికొందరు నామమాత్రపు ఫీజులను నిర్ణయించి ఉత్తమ శిక్షణ అందిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనూ యాజమాన్యాలు ఈ క్రీడలను ప్రోత్సహిస్తున్నాయి. సెయింట్ జోసఫ్ మహిళా జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, కేవీఆర్ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు మార్షల్‌ఆర్ట్స్‌లో రాణిస్తున్నారు. అందులో పతకాలు సాధిస్తున్నారు.

క్రీడల్లో రాణిస్తూ.. పతకాలు సాధిస్తూ

మార్షల్ ఆర్ట్స్ క్రీడాంశాల్లో నగరంలోని ఎంతో మంది విద్యార్థినీ, విద్యార్థులు వ్యక్తిగతంగా ప్రతిభ చూపుతున్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన క్రీడా పాలసీ వల్ల రాష్ట్ర స్థాయి, రీజియన్ స్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయిలోను క్రీడల వాతవరణం పెరిగింది. ప్రస్తుతం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్షల్‌ఆర్ట్స్ క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో కర్నూలు నగరం నుంచి ప్రాతినిధ్యం వహించిన బాలబాలికలు నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

కాంస్యం సాధించిన లేఖ్యా సిరి చందనా



నారాయణ పాఠశాలలో చదువుతున్న బి.లేఖ్యా 63 కిలోల విభాగంలో రాష్ట్ర స్థాయిలో కాంస్య పతకం సాధించింది. చదువుతూనే మార్షల్ ఆర్ట్స్‌లో వ్యక్తిగత ప్రతిభ చాటుతోంది. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో పతకం సాధించింది. మార్షల్ ఆర్ట్స్‌లో మరిన్ని విజయాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది.

రాష్ట్రస్థాయిలో కాంస్యం సాధించిన కార్తీక



నారాయణ స్కూల్‌లో చదువుతున్న కార్తీక స్కూల్ గేమ్స్ క్రీడల్లో ప్రతిభ చాటింది. గత సెప్టెంబర్ 30న నంద్యాల స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. తిరుపతిలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల తైక్వాండో పోటీల్లో సత్తా చాటింది. అండర్-17 విభాగంలో 68 కిలోల క్యాటగిరీలో పాల్గొన్న కార్తీక రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించింది. మరింతగా సాధన చేసి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం, పతకం సాధించడం తన లక్ష్యమని పేర్కొంది.

తైక్వాండోలో రాణిస్తున్న టీ.యం.గాయత్రీ



తైక్వాండోలో టీయం గాయత్రీ మంచి ప్రతిభ చాటుతోంది. వాసవి మహిళా కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న గాయత్రీ గత నెల 27వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయింది. ఈ నెల 4, 5 తేదీల్లో కడప జిల్లా రైల్వేకోడూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో అండర్-19 విభాగంలో సత్తా చాటి కాంస్య పతకం సాధించింది.

వెండి పతకం సాధించిన వెంకట శివరాం



పాతబస్తీలోని సిరాక్ పాఠశాలలో కే.వెంకట శివరాం 10వ తరగతి చదువుతున్నాడు. అండర్-17 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో తిరుపతి పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న శివరాం వెండి పతకం సాధించారు.

బన్ని ఉత్సవాల్లో జిల్లా యంత్రాంగం చర్యలు భేష్



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

కర్నూలు (సెంట్రల్): హాలహర్వి మండలం దేవరగట్టు బన్నీ ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించడంతో ప్రాణ నష్టం జరగలేదని, ఇందుకు కలెక్టర్, ఎస్పీలు తీసుకున్న చర్యలే కారణమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీలను వేర్వేరుగా వారి కార్యాలయాల్లో కలిసి అభినందలు తెలిపారు. ఈసారి బన్నీ ఉత్సవాలలో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘాను ఉంచడంతో తక్కువ సంఖ్యలో భక్తులు గాయపడ్డారన్నారు. ప్రాణనష్టం జరగలేదని, ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకోసం జనవిజ్ఞాన వేదిక అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శేషాద్రి రెడ్డి, నాయకులు మహమ్మద్ మియా, మన్సూర్ బాషా, శ్రీరాములు, రమేష్, రామలక్ష్మణ్, శివ, బాషా, అఫ్రిన్ పాల్గొన్నారు.

నేడు వాల్మీకి మహర్షి జయంతి

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9.30 గంటలకు వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్ తెలిపారు. ధర్నా చౌక్‌లోని వాల్మీకి విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమంలో కార్యకర్తలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ హాస్టళ్లలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పి.వెంకటలక్ష్మమ్మ

కర్నూలు(అర్బన్): జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ.వెంకటలక్ష్మమ్మ సూచించారు. ఆమె బుధవారం తన ఛాంబర్ నుంచి జిల్లాలోని సహాయ బీసీ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తుపాను ప్రభావం వల్ల పాఠశాలలకు సెలవు ప్రకటించిన నేపథ్యంలో హాస్టళ్లలోని పిల్లలు బయట తిరగకుండా చూడాలన్నారు. అలాగే దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో ఎంత మంది విద్యార్థులు హాస్టళ్లకు వచ్చారనే విషయాలను హాస్టళ్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పెద్దపాడు, మీదివేముల, అమడగుంట్ల, కోసిగి హాస్టళ్లకు చెందిన వసతి గృహ సంక్షేమాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని వసతి గృహాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా, బయటకు ప్రవహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే హాస్టల్ మిద్దెలపై పేరుకుపోయిన చెత్త చెదారం, గడ్డిని తొలగించి నీరు సాఫీగా కిందకు పారేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతగా ఉండాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 17న వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా అన్ని వసతి గృహాల్లో వాల్మీకి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించి ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



మురుగు సమస్యను తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు వెల్లడించారు. బుధవారం స్థానిక ఆదిత్యనగర్‌లో మురుగు కాల్వలను కమిషనర్ పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి ఫిర్యాదు మేరకు కమిషనర్ కాలనీలో పర్యటించారు. కొద్దిపాటి వర్షం వస్తే డెక్కన్ బిర్యానీ సెంటర్ వద్ద మురుగు నీరు రోడ్డెక్కి వాహనాదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నట్లు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మురుగు, అపరిశుభ్ర వాతవరణంలో వ్యాధులు ప్రబలే అవకాశముందని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య తనిఖీదారుడు రవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో న్యుమోనియా ప్రమాదకరం



న్యుమోనియా గురించి వివరిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): చల్లటి వాతావరణంలో చిన్నారులకు వచ్చే న్యుమోనియా వ్యాధి ప్రమాదకరమని డెమో శ్రీనివాసులు చెప్పారు. బుధవారం స్థానిక జొహరాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 36వ సచివాలయం కిందగేరిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడం (న్యుమోనియా) గురించి అవగాహన కల్పించారు. న్యుమోనియా సోకితే శ్వాస తీసుకోవడానికి కష్టంగా ఉంటుందన్నారు. జబ్బు ఉన్న వారు తుమ్మినప్పుడు గాలి ద్వారా బ్యాక్టీరియా వేరొకరికి అంటుకునే ప్రమాదం ఉందని చెప్పారు. వ్యాధినిరోధక శక్తి తక్కువ ఉన్న ఐదేళ్లలోపు పిల్లలకు, 60 ఏళ్లు పైబడిన వారికి జబ్బు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ జబ్బు సోకితే దగ్గు, జ్వరం, ఛాతినొప్పి, గళ్ల పడటం, చర్మం నీలం రంగులోకి మారడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. రోగులు దగ్గినప్పుడు చేతిరుమాలు అడ్డుపెట్టుకోవాలని సూచించారు. న్యుమోనియా రాకుండా ఉండేందుకు పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని కోరారు. తరచూ చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, ఆరోగ్య కార్యకర్త కవిత, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సీఆర్ భవన్‌లో కులాంతర వివాహం

కర్నూలు(సెంట్రల్): భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యాలయం (సీఆర్ భవన్)లో కులాంతర వివాహంతో ఓ జంట ఒక్కటైంది. ఎరుకుల కులానికి చెందిన అఖిలేష్, ఉప్పర కులానికి చెందిన అర్చన ప్రేమించుకున్నారు. వీరి వివాహానికి యువతి కుటుంబీకులు అభ్యంతరం తెలపడంతో సీపీఐ కార్యాలయంలో వివాహం చేసుకునేందుకు రాగా, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి వారి పెళ్లి జరిపించి ఆశీర్వదించారు.

రసవత్తరంగా నర్సింగ్ ఎన్నికల ప్రక్రియ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ రసవత్తరంగా మారింది. బుధవారం ఈ ఎన్నికలకు సంబంధించి రెండు ప్యానళ్ల అభ్యర్థులు తమ నామినేషన్లను ఎన్నికల అధికారి బి.చెన్నమ్మకు దాఖలు చేశారు. ఒక ప్యానెల్‌లో అధ్యక్షురాలిగా హెడ్ నర్సు ఎం.లీల, ప్రధాన కార్యదర్శిగా స్టాఫ్‌నర్సు ఎన్.భంగారి, ట్రెజరర్‌గా హెడ్‌నర్సు ఎన్.లక్ష్మినరసమ్మ, ఉపాధ్యక్షురాలిగా ట్యూటర్ జి.శాంతిభవానితో పాటు ఐదుగురు ఈసీ మెంబర్లు, మరో ప్యానెల్‌లో అధ్యక్షురాలిగా హెడ్‌నర్సు పి.ఆదిలక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శిగా స్టాఫ్‌నర్సు డి.మంజులాదేవి, ట్రెజరర్‌గా హెడ్ నర్సు జి.విజయమ్మ, ఉపాధ్యక్షురాలిగా హెడ్ నర్సు వి.శ్రీదేవితో పాటు ఐదుగురు ఈసీ మెంబర్లు ఉన్నారు. నామినేషన్ల స్క్రూటిని 17వ తేదీన, ఉపసంహరణ 18న, ఎన్నికలు 23న, అదే రోజు ఫలితాల ప్రకటన ఉంటుందని ఎన్నికల అధికారిణి బి.చెన్నమ్మ తెలిపారు. కాగా ఎన్నికల ప్రక్రియ వాడిగావేడిగా సాగుతోంది. ఒక ప్యానెల్‌పై మరో ప్యానెల్ సభ్యులు ఆరోపణలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. గతంలో వారు అధ్యక్షులుగా ఉన్న సమయంలో చేసిన పనుల గురించి చెబుతూ భవిష్యత్‌లో చేయబోయే పనుల గురించి వివరిస్తూ ప్రచారం చేసుకుంటున్నారు.

కేసీ కెనాల్ ఎఫ్ఏసీ డీఈఈగా ప్రసాదరావు

కర్నూలు (సిటీ): కేసీ కెనాల్ కర్నూలు సబ్‌డివిజన్ డీఈఈగా పూర్తి అదనపు బాధ్యతలను ప్రసాదరావుకు అప్పగించారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ప్రసాదరావు ప్రస్తుతం హంద్రీ - నీవా సర్కిల్-1 డివిజన్-3 డీఈఈగా పనిచేస్తున్నారు. కేసీ కెనాల్ డీఈఈగా పనిచేస్తున్న రఘురామిరెడ్డి గత నెల జరిగిన బదిలీల్లో బదిలీ అయ్యారు. ఖాళీగా ఉన్న డీఈఈ పూర్తి అదనపు బాధ్యతలను ప్రసాదరావుకు అప్పగించారు.

31న దీపాలంకరణ సేవ

కర్నూలు కల్చరల్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 31వ తేదీ ఓల్డ్ సిటీలోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో దీపావళి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, సాయిబాబా భక్త మండలి సభ్యులు తెలిపారు. సాయి బాబాకు ప్రీతికరమైన దీపాలంకరణ చేపట్టనున్నామని, భక్తులు 31వ తేదీ సాయంత్రం దీపాలంకరణ సేవ, పల్లకీ సేవలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు జే.రంగలక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు ఆయా శిక్షణా సంస్థలు ఎంపానల్ చేసేందుకు కావాల్సిన వివరాలతో కూడిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ) (ఈఓఐ డాక్యుమెంట్ నంబర్ 757795) 22 ఏపీ ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (https://tender.approcurement.gov.in) లో అప్‌లోడ్ చేయడం జరిగిందని తెలిపారు. ఆసక్తి కలిగిన శిక్షణా సంస్థలు ఇతర వివరాల కోసం ఈఓఐ డాక్యుమెంట్‌ను ఏపీ ఈ ప్రొక్యూర్‌మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జేడీ కోరారు. శిక్షణా సంస్థలు కచ్చితంగా డీఎస్‌కే (డిజిటల్ సిగ్నేచర్ కీ) కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకోవాలి



నాన్ క్యాడర్ ఎస్పీగా బదిలీపై వెళుతున్న నాగబాబును ఘనంగా సత్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (టౌన్): నాన్ క్యాడర్ ఎస్పీగా పదోన్నతి పొందిన ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగబాబు వృత్తిలో బెస్ట్ ఆఫీసర్‌గా పేరు తెచ్చుకోవాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో.. పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు పలికారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, డీఎస్పీలు శ్రీనివాసచారి, శ్రీనివాసరావు, కృష్ణమోహన్, సీఐలు, ఆర్ఐలు, ఏఆర్ ఎస్ఐలు పాల్గొన్నారు.నాగబాబు బదిలీపై ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ విజయవాడకు వెళుతున్నట్లు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీ ఐటీఐ స్టాఫ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కర్నూలు (సిటీ): ఆంధ్రప్రదేశ్ ఐటీఐ/డీఎల్‌టీసీల స్టాఫ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ తరఫున ఎన్నికల అధికారులుగా బి.కోదండరామయ్య, సూరప్ప, ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగళరెడ్డి పర్యవేక్షణలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా బి.ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులుగా టి.హరీష్ కుమార్, ఎస్.లక్ష్మీదేవి, జిల్లా కార్యదర్శిగా ఎన్.శిరీష, సహాయ కార్యదర్శులుగా ఎస్.అబ్దుల్ నబి రసూల్, ఎ.నిర్మల, జిల్లా కోశాధికారిగా సి.సూర్యశేఖర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఈసీ మెంబర్లుగా నాగేంద్రప్రసాద్, రామయ్య, బి.శ్రీనివాసులు, ఎస్.ఇంతియాజ్ ఎన్నికయ్యారు.

కార్మికుల పక్షాన ఏఐటీయూసీ పోరాటం

కర్నూలు(సెంట్రల్): ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అక్టోబర్ 31వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31వ తేదీన ఆవిర్భావించిందన్నారు. కార్మికుల తరపున పోరాటాలు చేయడంతో 44 లేబర్ చట్టాలను సాధించిందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్లను తీసివేయాలన్న ప్రధాన లక్ష్యంతో ప్రస్తుతం సంఘం పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. నాయకులు పులగం మద్దిలేటి, బాబులాల్‌స్వాములు, నాగోషలు, షాలు, ఈశ్వర్, రామస్వాములు పాల్గొన్నారు.

మోదీ పాలనలో కార్మికులకు తీరని అన్యాయం

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు తిరుపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కర్నూలులో ఐఎఫ్‌టీయూ టీయూసీఐలో విలీనానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 రాష్ట్రాల్లో సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికుల కోసం పనిచేస్తున్న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూను విలీనం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు శీను, మోహన్‌రాజు, వెంకటేష్, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

కర్నూలు (లీగల్): ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏవైనా కేసులు ఉంటే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించి ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా సత్వరం పరిష్కరించుకోవచ్చని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ అన్నారు. బుధవారం సామరస్యపూర్వకంగా పరిష్కరించబడిన కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నంద్యాల జిల్లా నివాసి కర్నూలు టీబీ జిల్లా యూనిట్‌లో సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. 2023 ఏప్రిల్ 13న అనారోగ్యంతో సన్‌షైన్ హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందగా రూ.4,17,611 ఖర్చయ్యింది. బిల్లులు తీసుకొని మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేయగా సదరు ఆస్పత్రికి లైసెన్స్ పునరుద్ధరించలేదని, కిమ్స్ ఆసుపత్రిలో విలీనం చేసినట్లు బదులిస్తూ దరఖాస్తు తిరస్కరించారు. దీనిపై ఆస్పత్రి వారిని ఆశ్రయించినప్పటికీ స్పందన లేకపోవడంతో బాధితుడు శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించారు. అదాలత్ వారు ఆస్పత్రికి నోటీసులు జారీ చేసి ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించారు. ఆస్పత్రి వారు రూ.3 లక్షలు చెల్లించడంతో బాధితుడు కేసు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కానీ లేదా తీర్పు ద్వారా కేసు పరిష్కారం జరిగితే తదుపరి అప్పీలు ఉండదని ఆయన వెల్లడించారు.